సాక్షి
వికారాబాద్

బుధవారం | 11 | అక్టోబర్ | 2023



రోజుకో మలుపు!

కాంగ్రెస్ జాబితా రాక ముందే తాండూరు టికెట్ తమకే వస్తుందంటూ ఆ పార్టీ నేతల ప్రచారం చేసుకుంటున్నారు. 10లో▸



దిమ్మెలకు బదులు కట్టెలు

వికారాబాద్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి పెద్దవాగుపై వంతెన శిథిలావస్థకు చేరడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 10లో▸



పత్తి రైతు దిగాలు

ప్రస్తుత సీజన్ పత్తి సాగు రైతన్నకు కలిసి రాలేదు. అనుకూల వాతావరణం లేక పత్తి ఎదుగుదల లోపించింది. 11లో▸

న్యూస్‌రీల్

'ప్రజావాణి' వాయిదా

వికారాబాద్ అర్బన్: శాసనసభ ఎన్నికల దృష్ట్యా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అనంతరం యధావిధిగా కార్యక్రమాన్ని కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చి ఇబ్బంది పడరాదని ఆయన సూచించారు.

షాద్‌నగర్‌కు అదనపు జిల్లా కోర్టు మంజూరు



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న న్యాయవాదులు

షాద్‌నగర్: అదనపు జిల్లా కోర్టును షాద్‌నగర్‌కు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మంగళవారం బార్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. షాద్‌నగర్‌కు అదనపు జిల్లా కోర్టును మంజూరు చేయించడంతో న్యాయసేవలు మరిన్ని అందుబాటులోకి వచ్చాయని పలువురు న్యాయవాదులు అన్నారు. ఇప్పటి వరకు జిల్లా కోర్టు సేవల కోసం మహబూబ్‌నగర్, రంగారెడ్డి కోర్టులకు వెళ్లేవారని తెలిపారు. స్థానికంగా జిల్లా అదనపు కోర్టు ఏర్పాటుతో ఈ ప్రాంతం వారికి ఎంతో వెసులుబాటు ఉంటుందన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తులు, హైకోర్టు రిజిస్ట్రార్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చొరవతో అదనపు కోర్టు మంజూరైందని అన్నారు. ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపిన వారిలో న్యాయవాదులు ఏజీపీ కంచి రాజ్‌గోపాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ రావు, న్యాయవాదులు మనోహర్‌రెడ్డి, సత్యనారాయణ యాదవ్, గుండుబావి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆయుధాలు అప్పగించండి

ఉత్తర్వులు జారీ చేసిన సీపీలు

సాక్షి, సిటీబ్యూరో: శాసన సభ ఎన్నికలు నవంబర్ 30న జరగనున్న నేపథ్యంలో గ్రేటర్ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో లైసెన్స్‌డ్ తుపాకులు, ఆయుధాలు కలిగి ఉన్నవారు వాటిని స్థానిక పోలీసు స్టేషన్‌లో లేదా ఆథరైజ్డ్ ఆర్మ్స్ డీలర్ల వద్ద డిపాజిట్ చేయాలని కమిషనర్లు ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 16 లోపు ఈ ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు. ఆయుధాలను డిపాజిట్ చేయని వారి లైసెన్స్‌లు రద్దు చేసి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నగర కొత్వాల్ సీవీ ఆనంద్ హెచ్చరించారు. డిసెంబర్ 10 ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాతే ఆయా ఆయుధాలను సంబంధిత వ్యక్తులకు తిరిగి అప్పగిస్తామన్నారు. రాచకొండ పరిధిలోని జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులు నిర్వర్తించే సెక్యూరిటీ గార్డులకు ఆయుధాల డిపాజిట్ నుంచి మినహాయింపు ఉంటుందన్నారు.

రాజకీయ సందడి

ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ఏర్పాట్లలో అధికారులు

- ప్రచారంలో బిజీగా నేతలు
- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్‌ఎస్
- ఇంకా ఖరారు చేయని ఇతర పార్టీలు
- హస్తం, బీజేపీ ఆశావహుల్లో మొదలైన ఆందోళన
- జిల్లాలో 9,34,523 మంది ఓటర్లు
- 1,133 పోలింగ్ కేంద్రాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగడంతో జిల్లాలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అందరూ ఊహించినట్లే డిసెంబర్ రెండో వారంలోగా ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. సోమవారం నుంచే కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు గోడలపై రాతలు, బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపులో నిమగ్నమయ్యారు. ప్రధాన కూడళ్లు, వీధుల్లోని రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు.

సర్వం సిద్ధం

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇప్పటికే ప్రజలకు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఓటరు తుది జాబితాను సైతం ప్రకటించారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు అధికార బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించింది. అయితే కాంగ్రెస్, బీజేపీలు ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. కాంగ్రెస్ గెలుపు గుర్రాల కోసం తీవ్రస్థాయిలో అన్వేషిస్తోంది.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఓటరు తుది జాబితాను ప్రకటించింది. జిల్లాలో మొత్తం 9,34,523 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 4,64,822 మంది, స్త్రీలు 4,69,659 మంది, ట్రాన్స్ జెండర్లు 42 మంది ఉన్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. వికారాబాద్‌లో 2,23,398 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 1,11,605 మంది, మహిళలు 1,11,780 మంది, ట్రాన్స్ జెండర్లు 13 మంది ఉన్నారు. తాండూరులో మొత్తం ఓటర్లు 2,28,495 మంది కాగా, అందులో పురుషులు 1,11,242 మంది, మహిళలు 1,17,243 మంది, ట్రాన్స్ జెండర్లు 10 మంది ఉన్నారు. పరిగిలో మొత్తం ఓటర్లు 2,52,379 మంది ఉండగా, పురుషులు 1,27,835 మంది, మహిళలు 1,24,537 మంది, ఏడుగురు ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. కొడంగల్‌లో మొత్తం ఓటర్లు 2,30,251 మంది ఉండగా, పురుషులు 1,14,140, మహిళలు 1,16,099 మంది, ట్రాన్స్ జెండర్లు 12 మంది ఉన్నారు.

1,133 పోలింగ్ కేంద్రాలు

ఈ సారి కూడా ఈవీఎంలను వినియోగించనున్నారు. ఎన్నికల్లో వీవీ ప్యాట్‌లను ఈవీఎంలకు అనుసంధానం చేస్తారు. వీవీ ప్యాట్‌ల ద్వారా తాము ఎవరికి ఓటు వేశామనే విషయాన్ని ఓటరు తెలుసుకునే అవకాశం ఉంటుంది. అవసరానికి మించి ఈవీఎంలు, ఈవీ ప్యాడ్‌లు అందుబాటులో ఉంచారు. జిల్లా వ్యాప్తంగా 1,133 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆయా పార్టీల నాయకులు క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

పరిగి మార్కెట్ యార్డులో ఓట్ల లెక్కింపు

పరిగి: జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపును పరిగి మార్కెట్ యార్డులో నిర్వహించనున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్పీ కోటిరెడ్డితో కలసి మార్కెట్ యార్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపునకు మార్కెట్ యార్డును ఎంపిక చేసినట్లు తెలిపారు. యార్డ్ పరిసరాల్లోని చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గుంతలను పూడ్చాలని సూచించారు. యార్డు చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణం, సీసీ టీవీ కంట్రోల్ రూంకు ఏర్పాట్లు చేయాలన్నారు. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు మూడు గోదాములను పరిశీలించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ లాల్‌సింగ్, జిల్లా మార్కెట్ అధికారి సారంగపాణి, డీఎస్‌ఓ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా అమలు చేయాలి

వికారాబాద్ అర్బన్: ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నియమావళి అమలు, విధివిధానాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు కూడా సహకరించాలన్నారు. కోడ్ అమల్లోకి వచ్చినందున ఫ్లెక్సీలు, బ్యానర్లు, గోడలపై రాతలను తొలగించాలని ఆదేశించారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఆర్డీవోలు శ్రీనివాసరావు, విజయ కుమారి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎదురు చూపులే..!

- జిల్లాలో లక్ష ఆర్థిక సాయం లబ్ధిదారులు 9,754 మంది
- మొదటి విడతలో 1,200 మంది బీసీ కులవృత్తుల వారికి..
- రెండో విడతలో రెండు వందల మందికే..
- ఆందోళనలో అర్హులు

వికారాబాద్ అర్బన్: బీసీ కుల వృత్తుల వారికి ప్రభుత్వం ప్రకటించిన రూ. లక్ష సహాయం రెండో విడత కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన రూ. లక్ష సహాయం అర్హులకు అందేలా కనిపించడం లేదు. కొందరికే ఈ పథకం అందడంతో మిగిలిన వారిలో ఆందోళన మొదలైంది. జిల్లాలోని ఒక్కో నియోజకవర్గం నుంచి మొదటి విడతలో మూడు వందల మంది లబ్ధిదారుల చొప్పున పన్నెండు వందల మంది రూ. లక్ష సాయం అందుకున్నారు. రెండో విడతలో నియోజకవర్గానికి రెండు వందల చొప్పున బీసీ వెల్ఫేర్ అధికారులు జాబితాను సిద్ధం చేశారు. కానీ ఎప్పుడు ఇస్తారనే దానిపై స్పష్టత లేదు.

అందని కార్పొరేషన్ రుణాలు

జిల్లాలో 2016 నుంచి బీసీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వడం లేదు. ఎన్నికల ముందు తెచ్చిన బీసీ కుల వృత్తుల వారికి రూ. లక్ష ఆర్థిక సాయం కూడా సక్రమంగా అమలు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ నెల 5న మంత్రి కేటీఆర్ వికారాబాద్ పర్యటనకు ముందు రోజు నియోజకవర్గానికి వంద మందికి చొప్పున నాలుగు వందల మందికి రెండో విడతలో భాగంగా లక్ష ఆర్థిక సాయాన్ని వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. రెండో విడతకు ఎంపికైన 800 మందిలో కేవలం 200 మందికి మాత్రమే పథకం అమలు చేయడం విమర్శలకు తావిస్తోంది.

ఎంపికలో తీవ్ర జాప్యం

బీసీ కులవృత్తిదారుల ఎంపిక జాబితాను స్థానిక ఎమ్మెల్యే కూడా ఆమోదించాల్సి ఉండటంతో తీవ్ర జాప్యం జరుగుతుందనే ప్రచారం ఉంది. లబ్ధిదారుల ఎంపిక పైకి బీసీ కార్పొరేషన్ అధికారులు చేస్తున్నట్లే చెబుతున్నా అంతర్గతంగా మాత్రం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సూచించిన పేర్లు మాత్రమే జాబితాలో ఉంటున్నట్లు సమాచారం. అర్హుల ఎంపికలో గ్రామస్థాయి నాయకుల నుంచి ఎమ్మెల్యే వరకు జోక్యం ఉండటంతో జాబితాను ఒకటికి నాలుగు సార్లు మారుతున్నాయి. ఇప్పటికే సిద్ధ చేసిన జాబితాలో తమ పేరు ఉన్నా తుది జాబితాలో ఉంటుందా లేదా అనే అనుమానం చాలా మందిలో ఉంది.

13వేల పైచిలుకు దరఖాస్తులు

గతంలో రూ. లక్ష ఆర్థిక సాయం కోసం ప్రభుత్వం బీసీ కుల వృత్తిదారుల నుంచి దరఖాస్తులు కోరింది. నాయీబ్రాహ్మణలు, ఉప్పరి, అవుసలి, రజక, కుమ్మరి, కంసాలి, వడ్ల, కంచరి, కమ్మరి, పూసల, మేదర, వడ్డెర, ఆరె కటికలు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 13,157 అర్జీలు వచ్చాయి. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషన్లు దరఖాస్తులను పరిశీలించి 9,754 మందిని అర్హులుగా గుర్తించారు. మొదటి విడతలో 1,200 మందికి రూ. లక్ష సాయం అందజేశారు. రెండో విడతలో మరో 800 మందికి సెప్టెంబర్‌లో ఆర్థిక సాయం చేయాల్సి ఉంది. అయితే కేవలం 200 మందికి ఈ నెల 4 డబ్బు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. మరో 600 మంది లక్ష సాయం కోసం ఎదురు చూస్తున్నారు. మరో 8,354 మంది అర్హులకు పథకం ఎప్పుడు అమలవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో వారు ఆందోళనలో ఉన్నారు.

జాబితా సిద్ధం

రెండో విడత కుల వృత్తిదారుల జాబితా సిద్ధంగా ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ఆర్థిక సాయం నగదు జమ చేస్తాం. ఎంపికైన ప్రతి ఒక్కరికీ రూ. లక్ష సాయం అందుతుంది. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ఉపేందర్, జిల్లా బీసీ కమిషన్ ఆఫీసర్

బతుకుదెరువు కోసం వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం
- మృతులు మహారాష్ట్రలోని దాబా గ్రామస్తులు
- మొయినాబాద్ మండలంలో ఘటన



కారు ఢీకొనడంతో రోడ్డుపక్కన పడిపోయిన స్కూటీ

మొయినాబాద్: బతుకుదెరువుకోసం వలస వచ్చిన దంపతులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ సంఘటన మండల పరిధిలోని అమ్డాపూర్ రోడ్డులో ముర్తూజగూడ, నజీబ్‌నగర్ గ్రామాల మధ్య సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా గోన్సిపీరీ తాలూకా దాబా గ్రామానికి చెందిన పూర్ణిమ(23), ధర్మమేశ్రాం(35) దంపతులు. మూడేళ్ల క్రితం మొయినాబాద్ మండలానికి బతుకుదెరువుకోసం వలస వచ్చారు. పూర్ణిమ తండ్రి సుకాలు నాన్‌సింగ్ నిగ్‌వాక్ మండల పరిధిలోని ఎనికేపల్లి రెవెన్యూలో ఉన్న పీకాక్ కంట్రీ ఫాంహౌస్‌లో పని చేస్తున్నాడు. పూర్ణిమ, ధర్మమేశ్రాం కూడా కొంత కాలం అక్కడే పనిచేసి మూడు నెలల క్రితం నుంచి అమ్డాపూర్‌లోని ఓ ఫాంహౌస్‌లో పనిచేస్తున్నారు. సోమవారం ఇద్దరూ స్కూటీపై పూర్ణిమ తండ్రి వద్దకు వెళ్లారు. రాత్రి 11.30 గంటల సమయంలో కాశీంబౌలి సమీపంలోని మల్లేశ్ ఫాంహౌస్‌లో జరిగిన సీరియల్ షూటింగ్ ముగించుకుని నగరానికి వెళ్తున్న సీరియల్ నటి కూన సరస్వతి, మరో నటి కారు(టీఎస్ 12 జెడ్ 4689)ను అతివేగంతో రాంగ్‌రూట్‌లో నడిపి ఎదురుగా వచ్చిన స్కూటీని ఢీకొట్టారు. భార్యాభర్తలు ఎగిరి రోడ్డుపక్కన ఉన్న ఫెన్సింగ్ వైర్, కడీలపై పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతివేగంతో కారు నడిపి ప్రమాదానికి కారణమైన సీరియల్ నటి సరస్వతిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసీఆర్ పాలన అంతమే..

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో రామ్మోహన్‌రెడ్డి

దోమ: సీఎం కేసీఆర్ నియంతపాలన సాగిస్తున్నారని, ఆ పాలనను అంతమొందించాల్సిన అవసరం ఉందని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బొంపల్లిలో బీఆర్‌ఎస్‌కు చెందిన వార్డు సభ్యుడి తోపాటు విశ్రాంత ఏఎస్‌ఐ అంతిరెడ్డి, పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీలు ఇచ్చి అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రజలు ఆ పార్టీని నమ్మరాదని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్ కృష్ణప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, జనరల్ సెక్రటరీ యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ యాదయ్య గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ యాదవరెడ్డి, బొంపల్లి మాజీ ఎంపీటీసీ వెంకట్, సుల్తాన్‌పూర్ సర్పంచ్ వెంకట్‌రాంరెడ్డి, బొంపల్లి మాజీ సర్పంచ్ రాములు, నాయకులు మల్లారెడ్డి, రాములు, మధుకర్‌రెడ్డి, ఆర్ నర్సింహారెడ్డి, ఇంతియాజ్, బషీర్ పాల్గొన్నారు.

బంగారం, విదేశీ సిగరెట్ల పట్టివేత

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో ఇద్దరు వేర్వేరు వ్యక్తులు అక్రమంగా తీసుకొచ్చిన బంగారంతో పాటు కంబోడియా నుంచి అక్రమంగా తీసుకొచ్చిన విదేశీ సిగరెట్లను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం అర్ధరాత్రి రియాద్ నుంచి వయా మస్కట్ మీదుగా వచ్చిన ప్రయాణికుడు కస్టమ్స్ తనిఖీలు పూర్తి చేసుకుని ఎయిర్‌పోర్టు విలేజ్‌లోకి వచ్చాడు. అక్కడ అతడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన నిఘా అధికారులు మరోసారి అతడి లగేజీని తనిఖీ చేయగా 317 గ్రాముల బరువైన రెండు బంగారు బిస్కెట్ల ముక్కలు, ఓ గొలుసు బయటపడింది. బంగారం విలువ రూ. 18.17 లక్షలు ఉండవచ్చునని అధికారులు నిర్ధారించారు. అదే విధంగా మంగళవారం ఉదయం బహ్రెయిన్ నుంచి వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించి అధికారులు అతడిని తనిఖీ చేయగా మలద్వారంలో క్యాప్సుల్స్ రూపంలో బంగారం తీసుకొచ్చినట్లు గుర్తించారు. వైద్యుల పర్యవేక్షణలో నాలుగు క్యాప్సుల్స్‌ను బయటికి తీశారు. 782 గ్రాములు కలిగిన బంగారం విలువ రూ. 46.13 లక్షలుంటుందని అధికారులు నిర్ధారించారు.

విదేశీ సిగరెట్లు స్వాధీనం

సోమవారం కంబోడియా నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికులను తనిఖీ చేయగా వారి వద్ద 1.17600 సిగరెట్లు లభ్యమయ్యాయి. వాటి విలువ 11.6 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నియంత పాలనకు త్వరలో విముక్తి

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీదే గెలుపు
- ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి



చల్లా వంశీచంద్‌రెడ్డి, నారాయణరెడ్డి, బాలాజీసింగ్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

ఆమనగల్లు: మరో 50 రోజుల్లో బీఆర్‌ఎస్ అవినీతి, నియంత పాలన నుంచి ప్రజలకు విముక్తి కలగనుందని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీ స్కీంలతో రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మండల పరిధిలోని రాంనుంతల గేటు వద్ద డీఎంకే ఫంక్షన్‌హాలులో మంగళవారం పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నా నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా సాధించిన అభివృద్ధి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సాధించిన అభివృద్ధిపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం పనిచేయాలని కోరారు.

కల్వకుర్తి అభివృద్ధే లక్ష్యం

కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. ఎమ్మెల్సీగా తాను కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ 82 కాలువ ప్రారంభించి పనులను చేపట్టడం జరిగిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన జైపాల్ యాదవ్ ఒక తట్ట మట్టి తీయలేదని అరకిలోమీటర్ కాలువ పనులు పూర్తి చేయించలేకపోయారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను బొంద పెడదామని నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ అన్నారు. మాడ్గుల జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఆమనగల్లు, కడ్తాల ఎంపీపీలు అనిత, కమ్లి మోత్యా నాయక్, ఆమనగల్లు, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహ, విజయ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బిల్లులు ఆగాయి అప్పులు మిగిలాయి

నమ్మి ఓటేసిన ప్రజలకు, గ్రామానికి ఏదైనా చేయాలనుకున్నారు.. అయితే వారిని నిధుల సమస్య వెంటాడింది.. సొంత డబ్బుతోపాటు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టారు.. కానీ సకాలంలో బిల్లులు రాక.. చేసిన అప్పులు తీర్చలేక.. వడ్డీలు కట్టలేక సర్పంచులు అవస్థలు పడుతున్నారు.

- చేసిన పనులకు బిల్లులు రాక పాట్లు
- వడ్డీలు కట్టలేకపోతున్నామని ఆవేదన
- ఎమర్జెన్సీ పేరుతో అరకొర బిల్లులకు మోక్షం
- ట్రెజరీలకు ఫ్రీజింగ్ జబ్బు
- నెలల తరబడి లాక్ లోనే ప్రధాన ఖాతాలు



ఇటీవల దోమ మండలంలో బిల్లుల కోసం ఆందోళన చేస్తున్న ప్రజాప్రతినిధులు

వికారాబాద్: గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు నెలల తరబడి బిల్లులు రాక సర్పంచులు విలవిలలాడుతున్నారు. సాధారణ బిల్లులు మూడు నుంచి నాలుగు నెలలుగా పెండింగులో ఉండగా, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు ఆరు నెలలు దాటినా మంజూరు కాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ట్రెజరీలకు ఫ్రీజింగ్ జబ్బు పట్టుకుంది. దీంతో పనులు చేసి బిల్లుల కోసం నెలలు సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని సర్పంచులు అంటున్నారు. వేతనాలు, చిన్నచిన్న బిల్లులు మినహా మిగతావి ఇవ్వటం లేదు. కేవలం శానిటేషన్‌కు సంబంధించిన బిల్లులు మాత్రమే విడుదల చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు మండలాల ఖాతాల్లో జమ అయినా గ్రామాల్లో, రోడ్లో పక్క పూర్తి స్థాయిలో మొక్కలు నాటి పెంచితేనే బిల్లులు చేస్తామని అధికారులు కండిషన్ పెట్టారు.

బిల్లులు చేసి పంపినా..

చేసిన పనులకు బిల్లులు చేసి పంపిన మూడు నెలలకు గానీ పాసవ్వడం లేదు. వెబ్‌సైట్‌లోకి వెళ్లి చూస్తే వేయిటింగ్ ఫర్ గవర్నమెంట్ అప్రూవల్ అని వస్తోందని సర్పంచులు అంటున్నారు. ఆయా పనులకు సంబంధించిన బిల్లులు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. అయితే కొన్ని సందర్భాల్లో ఎస్టీఓలపై ఒత్తిడి లేకుండా బిల్లులు మాత్రం చేసి అప్లోడ్ చేసి చేతులు దులుపుకొంటున్నారు. అయితే తమ వద్ద పెండింగ్ బిల్లులు ఏమీ లేవని అధికారులు అంటున్నారు. కానీ బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా కావటం లేదని సర్పంచులు ఆరోపిస్తున్నారు. గడిచిన 20 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఎస్‌ఎఫ్‌సీ నిధులు సైతం రావటంలేదు. కేవలం మూడు నెలల బిల్లులు మాత్రం ఇచ్చారని సర్పంచులు తెలిపారు.

మెజార్టీ బిల్లులదీ అదే పరిస్థితి

మెజార్టీ బిల్లులది అదే పరిస్థితి. ఒకటి రెండు మినహా అన్ని రకాల ఖాతాలకు ఫ్రీజింగ్ భూతం పట్టుకుంది. 15వ ఆర్థిక సంఘం నిధులు, జీపీ జనరల్, స్టేట్ ఫైనాన్స్ బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. బిల్లుల కోసం సర్పంచులు ఎస్టీఓ కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. ట్రాక్టర్లు, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, సీసీ రోడ్లు, మధ్యాహ్న భోజనం బిల్లులు, హాస్టళ్ల బిల్లులు, జీపీఎఫ్ లోన్లు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు.. ఇలా అన్ని రకాల బిల్లులు నెలల తరబడి మగ్గుతున్నాయి. అధికార పక్షానికి చెందిన ప్రజాప్రతినిధులు తమ ప్రభుత్వమంటూ బయటకు చెప్పుకోలేక లోలోపలే చర్చించు కుంటున్నారు. ప్రతిపక్షాలు, ఇతర కాంట్రాక్టర్లు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇటీవల దోమ మండలంలో సర్పంచులు ఆందోళన చేయడంతో పాటు కలెక్టర్‌ను కలసి తమ గోడును వెళ్లబోసుకున్నారు.

క్లుప్తంగా

జిప్సం ఫ్యాక్టరీపై ఫిర్యాదు

నేడు పీసీబీ కార్యాలయంలో విచారణ

తాండూరు రూరల్: తాండూరు మండలం మిట్ట బాసుపల్లి శివారులో ఉన్న ఏషియన్ బ్రౌన్ కెమికల్ ఫ్యాక్టరీపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్ తెలిపారు. జిప్సం ఫ్యాక్టరీ నుంచి వస్తున్న దుర్వాసనతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ ఫ్యాక్టరీ నుంచి వచ్చే నీటి కాలుష్యం వల్ల రైతుల కూడా పొలాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. నేడు (బుధవారం) ఈ ఫ్యాక్టరీ విషయమై హైదరాబాద్‌లోని బాలానగర్‌లో ఉన్న కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో విచారణ ఉందని చెప్పారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఫ్యాక్టరీని వెంటనే సీజ్ చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

దోమ: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. మండల పరిధిలోని దాదాపూర్‌కు చెందిన ఆరుగురు వ్యక్తులు ఓ రైతు పొలం వద్ద పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఎస్‌ఐ రవిగౌడ్ తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేసి వారిని పట్టుకున్నారు. వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

పోలీసుల తనిఖీలు

రూ.9.5లక్షల నగదు పట్టివేత



పట్టుబడ్డ నగదును చూయిస్తున్న సీఐ

అనంతగిరి: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మంగళవారం వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో భాగంగా ఓ వాహనంలో రూ.9.5లక్షలు పట్టుబడ్డాయి. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ మోహిత్ అనే వ్యక్తి బిజినెస్ చేస్తుంటాడు. టీఎస్ 09ఎఫ్ఏ2737 వర్నా కారులో తాండూరు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా అతని కారులో రూ.9.5లక్షలు ఉన్నాయి. వికారాబాద్ సీఐ శ్రీను కారును పీఎస్‌కు తరలించి పంచనామా నిర్వహించి తహసీల్దార్‌కు అప్పగించించారు. నగదుకు సంబంధించిన ఆధారాలు ఉన్నతాధికారులకు చూపించి నగదు తీసుకెళ్లాలని పోలీసులు సూచించారు.

ఆటోలో పట్టుబడ్డ రూ.6.55 లక్షలు

ఇబ్రహీంపట్నం: ఆటోలో తరలిస్తున్న రూ.6.55 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంచాల ఎస్‌ఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం... వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆరుట్లకు చెందిన కాసుల సురేశ్ ఆటోలో రూ.6.55 లక్షలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

రూ.2.20 లక్షల నగదు సీజ్

చేవెళ్ల: రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. చేవెళ్ల మండలంలోని నాలుగు చోట్ల చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేసినట్లు సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. సోదాల్లో సోమవారం రాత్రి రూ.2.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తాండూరుకు చెందిన భానుచందర్ అనే వ్యక్తి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఈ నగదు పట్టుకున్నామని చెప్పారు.

రోజుకో మలుపు!



కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే





బుయ్యని మనోహర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నిక అయోమయం

- డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డికే అంటూ ప్రచారం
- ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేరు
- టికెట్ రాకుంటే రాజీనామాలకు సిద్ధమంటున్న నేతలు

తాండూరు: తాండూరు కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. అధిష్టానం ఇంకా అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల పేర్లను ఖరారు చేయకముందే ఎవరికి వారు తమకే టికెట్ అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితం డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి మనోహర్‌రెడ్డికే టికెట్ అంటూ ప్రచారం సాగింది. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికే టికెట్ ఇస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. మరోవైపు టికెట్ వచ్చినా రాకున్నా పార్టీ గెలుపు కోసం పని చేస్తానని మనోహర్‌రెడ్డి చెప్పారు. మనోహర్‌రెడ్డి మాత్రం నియోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులను కలుస్తూ వారి మద్దతు కోరుతున్నారు.

రమేష్ మహరాజ్ వద్దకు కాంగ్రెస్ నేతలు

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రమేష్ మహరాజ్ వారం రోజులుగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్‌లతో పాటు పలువురు నాయకులు ఆయనను పరామర్శించేందుకు హాస్పిటల్‌కు వెళ్లారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న రమేష్ మహరాజ్ వారిని కలిసేందుకు ఆసక్తి చూపలేదు. అదే రోజు రాత్రి తాండూరు సీటు కోసం ఏఐసీసీ నేతలతో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డికే టికెట్ ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఈ విషయంలో ఏఐసీసీ నేతలు తాండూరు సీటు కేఎల్‌ఆర్‌కే సర్వేలు మెరుగ్గా ఉన్నాయని అధిష్టానానికి నేతలు సూచించారని తెలిసింది.

హస్తం పార్టీలో అశ్రునయనాలు

టికెట్ విషయంలో కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు కన్నీటి పర్యంతమవుతున్నారు. టికెట్ మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌కే ఇవ్వాలని ఏఐసీసీ సభ్యులు రమేష్ మహరాజ్ ఆస్పత్రి నుంచే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు వీడియో రికార్డు చేసి పంపించారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కల్వ సుజాత సైతం తాండూరు టికెట్ ఆశిస్తున్నారు. టికెట్ కోసం సోషల్ మీడియా వేదికగా కన్నీరు పెట్టుకుంది.

రాజీనామాకు సిద్ధమంటున్న నేతలు

మనోహర్‌రెడ్డికి తాండూరు టికెట్ కేటాయించాలని తాండూరు మున్సిపల్ మాజీ చైర్మన్ సునీత భర్త పార్టీ పెద్దలను కోరుతున్నారు. నిన్నమొన్నటి వరకు మనోహర్‌రెడ్డికే టికెట్ ఇస్తామని నేతలు హామీ ఇచ్చారు. సోమవారం రాత్రి నుంచి కేఎల్‌ఆర్ పేరు వినిపించడంతో డాక్టర్ సంపత్‌కుమార్ వర్గీయులంతా ఆందోళనకు గురయ్యారు. టికెట్ రాకపోతే పార్టీకి రాజీనామా చేస్తామంటూ స్పష్టం చేశారు.

దిమ్మెలకు బదులు కట్టెలు



పెద్దవాగుపై దిమ్మెలకు బదులుగా కట్టిన కట్టెలు

ప్రమాదాల బారిన వాహనదారులు

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి పెద్దవాగు వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. వాగుపై ఉన్న బ్రిడ్జి చాలా ఏళ్లక్రితం నిర్మించడంతో శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జికి రెండు వైపులా నిర్మించిన దిమ్మెలు పూర్తిగా పడిపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత ఎనిమిది నెలల క్రితం ద్విచక్ర వాహనదారులు వాగులో పడి ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గతంలో ఒక ఆర్టీసీ బస్సు కూడా ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు బ్రిడ్జిపై దిమ్మెలను నిర్మించలేకపోతున్నారు. ప్రమాదాల నివారణకు కంటితుడుపు చర్యగా కట్టెలు కట్టి చేతులు దులుపుకొంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి దిమ్మెలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సబ్జెక్టు టాపర్‌గా ఐశ్వర్య



అవార్డు అందుకుంటున్న ఐశ్వర్య

కొడంగల్: తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం కోటిలో బీఎస్సీ గ్రూప్ ఫుడ్ సైన్స్‌లో సబ్జెక్టు టాపర్‌గా కొడంగల్ విద్యార్థిని బాకారం ఐశ్వర్య ప్రతిభ చూపింది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విశ్వ విద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ విద్యులత, ఉన్నత విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ లింబాద్రి, ఉస్మానియా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ రవీందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, నగదు అవార్డును అందుకున్నారు. విద్యార్థిని ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యా వంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి తాపస్, మున్నూరు కాపు సంఘం జిల్లా కార్యదర్శి శోభమ్మ, కొడంగల్ మున్నూరు కాపు సంఘం నాయకులు శంకరప్ప, అనంత ప్రసాద్, బిచ్చప్ప, నర్సిరెడ్డి, శ్యాంసుందర్, ఓం ప్రకాశ్, నరేష్‌లు అభినందించారు.

కోడ్‌తో గోడలు క్లీన్!

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో గ్రామాల్లోని గోడలన్నీ క్లీన్ అవుతున్నాయి. ఈ మేరకు మంగళవారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని రెవెన్యూ అధికారులు, సిబ్బంది అసెంబ్లీ ఎన్నికల నియమావళిని అనుసరిస్తున్నారు. నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీల ప్రచారం గుర్తులు లేకుండా అధికారులు తొలగిస్తున్నారు. ఎన్నికల నియమాలను ప్రచారం చేస్తున్నామని తహసీల్దార్ వెంకటేశ్ తెలిపారు. – బొంరాస్‌పేట



గోడలపై పార్టీల గుర్తులను తుడిచేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రశంసాపత్రాల అందజేత



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్పీ

అనంతగిరి: ప్రపంచ మానసిక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాల, కళాశాలలో భరోసా కేంద్రం తరఫున వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు భరోసా కేంద్రం మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. పలు కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన బాలికలకు ఎస్పీ కోటిరెడ్డి చేతుల మీదుగా మంగళవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భరోసా ఇన్‌చార్జి ఎస్‌ఐ సుస్మిత, భరోసా ప్రతినిధులు పాల్గొన్నారు.

మోగిన నగారా.. తొలగిన ఫ్లెక్సీలు

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- పార్టీలు నిబంధనలు పాటించాలని సూచన



ఫ్లెక్సీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మొయినాబాద్ రూరల్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం పచ్చజెండా ఊపింది. ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడంతో పంచాయతీ కార్మికులు, అధికారుల సూచనల మేరకు ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్లను మంగళవారం ఉదయం నుంచి తొలగించారు. మండల పరిధిలోని బాకారం, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎన్కెపల్లి, అమ్డాపూర్, ముర్తుజాగూడ, కనకమామిడి, జాతీయ రహదారి డివైడర్లు, చౌరస్తాలో ఉన్న వివిధ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్లను తొలగిస్తున్నారు. గ్రామాల్లో పోస్టర్లను తొలగిస్తున్నామని ఎంపీఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించాలని అధికారులు సూచించారు.

నిబంధనలు అందరూ పాటించాలి

చేవెళ్ల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ ప్రచారాల పోస్టర్లు, ప్రభుత్వ వాహనాలపై రాజకీయ నాయకుల ఫొటోలను తొలగించేందుకు అధికారులు ఉపక్రమించారు. చేవెళ్ల మండల కేంద్రంలో మంగళవారం సిబ్బందితో గోడలపై వాల్ రైటింగ్స్, పోస్టర్లను తొలగించారు. ఎన్నికల నిబంధనలు అందరూ పాటించాలని అధికారులు సూచించారు.

రాజకీయాలకు దూరంగా ఉండాలి

ఐసీడీఎస్, సీడీపీఓ రేణుక

తాండూరు రూరల్: గ్రామ, పట్టణాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీలు రాజకీయాలకు అతీతంగా పని చేయాలని ఐసీడీఎస్, సీడీపీఓ రేణుక పేర్కొన్నారు. మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల సమావేశాలకు దూరంగా ఉండాలని సూచించారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి దారుణహత్య

పరిగి: గుర్తు తెలియని వ్యక్తిదారుణ హత్యకు గురైన ఘటన లక్నాపూర్ గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్నాపూర్ ప్రాజెక్టు సమీపంలో రాత్రి ఓ వ్యక్తి హత్యకు గురైనట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులకు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా, మృతుడి ముఖంపై బండరాయితో మోది హత్యచేసినట్లు గుర్తించారు. హత్య కోసం ఉపయోగించిన బండరాయి కూడా అక్కడే పాడేసి వెళ్లారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

14 క్వింటాళ్లు స్వాధీనం

యాచారం: అక్రమంగా తరలిస్తున్న 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం సాయంత్రం నక్కర్తమేడిపల్లి గ్రామంలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు పట్టుకున్నారు. సీఐ రామాంజనేయులు కథనం ప్రకారం.. కడ్తాల్ మండలం పల్లెచల్కతండాకు చెందిన ఇస్లావత్ రమేష్, శంకర్‌లు కొంత కాలంగా మంచాల, యాచారం మండల పరిధి గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి కడ్తాల్, ఆమనగల్లు తదితర ప్రాంతాల్లో ఉన్న పౌల్ట్రీ ఫాంలలో పనిచేసే కూలీలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రెండు వాహనాల్లో రేషన్ బియ్యాన్ని పల్లెచల్కతండాకు తరలిస్తున్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా నక్కర్తమేడిపల్లిలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులకు బియ్యం తరలిస్తున్న రెండు వాహనాలు పట్టుబడ్డాయి. దీంతో వాహనాలతో పాటు, బియ్యాన్ని గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బియ్యం పట్టుకున్న విషయాన్ని పోలీసులు యాచారం తహసీల్దార్ శ్రీకాంత్ రెడ్డికి సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ మారయ్య వివరాల ప్రకారం.. మంగల్‌పల్లి గ్రామ పరిధిలోని భారత్ ఇంజనీరింగ్ కళాశాల దగ్గర ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకున్న విషయాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిలో మృతదేహాన్ని పరిశీలించారు. నాలుగైదు రోజుల క్రితం ఉరేసుకొని ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బూత్ కమిటీలే కాంగ్రెస్ బలం



కాంగ్రెస్ పార్టీ శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- వీటిని మరింత బలోపేతం చేస్తాం
- పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి
- 'పట్నం' బూత్ సభ్యులకు శిక్షణ శిబిరం
- బీఆర్‌ఎస్ ఎత్తుగడలను తిప్పికొట్టాలని పిలుపు

అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ పార్టీకి బూత్ కమిటీలు కొండంత బలమని, వీటిని మరింత బలోపేతం చేస్తామని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, నాలుగు మున్సిపాలిటీలకు సంబంధించిన 319 బూత్ కమిటీల సభ్యులకు మంగళవారం పెద్దఅంబర్‌పేట తారా కన్వెన్షన్‌లో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, పీసీసీ బూత్ ఎన్ రోల్ ట్రైనింగ్ కమిటీ కన్వీనర్ పవన్ మల్లాది దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికల్లో 'బూత్ స్థాయిలో పోల్ మేనేజ్‌మెంట్, ప్రచార వ్యూహం, ఓటర్ల కలయిక-పార్టీ పటిష్టత, సోషల్ మీడియా' తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చాలా పటిష్టంగా ఉందని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా పార్టీ జెండాను భుజాన మోస్తున్న ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలు చాలా కీలకమైనవని, బీఆర్‌ఎస్ నాయకులు అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకుని దొడ్డిదారిన గెలవాలని చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పిలుపునిచ్చారు. త్వరలో నియోజకవర్గ సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి, అందరితో చర్చించి ప్రతి కుటుంబాన్ని కలిసి కాంగ్రెస్ పథకాలను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి నాయకులతో పాటు కాంగ్రెస్ ఎంపీపీలు.. జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు ఎంపీటీసీలు, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- కుటుంబపాలనకు చరమగీతం
- పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఉదయమోహన్‌రెడ్డి

శంకర్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం శంకర్‌పల్లిలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబపాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. చేవెళ్ల నియోజకర్గంలోని శంకర్‌పల్లిలో డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించి స్థానికులకు కేటాయించకుండా నగరానికి చెందిన వారికి కేటాయించడం సిగ్గుచేటు అన్నారు. ఎన్నికల్లో నియోజకవర్గం ప్రజలను ఏ విధంగా ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు ప్రకాశ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రవిందర్ రెడ్డి, నాయకులు రాజుగౌడ్, దేవ్‌లానాయక్, సుధాకర్‌రెడ్డి, ప్రశాంత్, శశికాంత్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై దాడి..

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ఇబ్రహీంపట్నం: బెల్ట్ షాపులపై దాడి చేసి అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపటేల్‌గూడ, పోచారం గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడులు జరిపినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 83 బీరు బాటిళ్లు, 240 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



అంజయ్య యాదవ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పాటిగడ్డ గ్రామస్తులు

కేశంపేట: బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చిత్రపటానికి గ్రామస్తులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. పాటిగడ్డ వాగును దాటేందుకు ఎన్నో ఏళ్ల నుంచి ఇబ్బంది పడుతున్నారు. గ్రామస్తుల విన్నపం మేరకు ఎమ్మెల్యే రూ.5.60 కోట్ల నిధులు మంజూరు చేయించారు. సర్పంచ్ మిటిలమ్మ, చిన్నమ్మ, ధన్‌రాజ్‌రెడ్డి, శేఖర్, జంగయ్య, శోభ, మనోహర్ రెడ్డి, వెంకటయ్య, కృష్ణయ్య, జలేందర్, కమలమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ' సేవలు అభినందనీయం

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి



రోగులతో మాట్లాడుతున్న విజయలక్ష్మి

నందిగామ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమం సేవలు అభినందనీయమని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ మంగళవారం షాద్‌నగర్ డివిజన్‌లోని అన్ని పీహెచ్‌సీలలో ఆరోగ్య మహిళ ప్రోగ్రాం సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీకి వచ్చిన రోగులతో ఆమె మాట్లాడారు. ఆరోగ్య సేవలు స్థానిక వైద్యులు ఏ విధంగా అందిస్తున్నారని రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సమయ పాలన పాటిస్తున్నారా.. రోగులతో ఏ విధంగా వ్యవహరిస్తున్నారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ వారం కనీసం 60మంది మహిళలకు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కాగా మంగళవారం 62 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి 10 మంది రక్త నమూనాలు సేకరించి కొండాపూర్‌లోని ఆస్పత్రికి పంపించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ పి.నరహరి, స్థానిక డాక్టర్ తులసి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.